సాక్షి
ఒడిశా


బుధవారం । 14 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,78,860
బంగారం : 750 మిల్లీ గ్రాములు
వెండి : 16 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



సికరపాయిలో చోరీ
సికరపాయి గ్రామంలో చోరీ జరిగింది. వృద్ధ దంపతులపై దాడి చేశారు.
- 8లో



టీచర్ల బదిలీలకు ఆమోదం
టీచర్ల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నిబంధనలు ప్రకటించారు.
- 8లో

నౌగొడాలో చీఫ్ సెక్రటరీ పర్యటన



నౌగొడా గ్రామంలో ప్రజలతో చీఫ్ సెక్రటరీ ముఖాముఖి సంప్రదింపులు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ ఆహుజా జాజ్‌పూర్ జిల్లా సుకిందా మండలం నౌగొడా గ్రామాన్ని సందర్శించారు. నౌగొడా ఒక ఆదర్శ గిరిజన గ్రామంగా ఆవిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కీలక అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన ముఖాముఖి చర్చించారు. ప్రధానంగా ప్రజా సంక్షేమానికి సంకల్పించిన ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణ, వాస్తవ లబ్ధిని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. రాష్ట్రంలో నౌగొడా గ్రామం ఆకలి చావుల ప్రాంతంగా తీవ్ర కలకలం రేపింది. 2016లో పోషకాహార లోపం కారణంగా ఈ ప్రాంతంలో జువాంగ్ గిరిజన సమాజంలో 19 మంది పిల్లలు మరణించడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రముఖ కార్యదర్శి సందర్శనలో రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ కార్యదర్శి



చీఫ్ సెక్రటరీని స్వాగతించిన ఎగువ నౌగొడా అంగన్‌వాడీ కేంద్రం సభ్యులు

గిరీష్ ఎస్‌ఎన్ మరియు జాజ్‌పూర్ కలెక్టర్ పి.అన్వేష రెడ్డి, వివిధ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వీరంతా గ్రామస్తులతో ఆయా శాఖలు, విభాగాల కార్యాచరణ సాఫల్యత విశ్లేషణ కోసం మాట్లాడారు.

సుభద్ర యోజన పథకం కింద గిరిజన మహిళలకు పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేటప్పుడు క్రమం తప్పకుండా ఆరోగ్య అవగాహన శిబిరాలను నిర్వహించాలని అధికారులను కోరారు. నిర్మాణంలో ఉన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఆరోగ్య సేవలు, స్త్రీ మరియు శిశు అభివృద్ధి, తాగునీటి సరఫరా ప్రాజెక్టులను ప్రముఖ కార్యదర్శి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎగువ నౌగొడా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. మమత యోజన లబ్ధిదారులతో మనోజ్ ఆహుజా సంభాషించారు. గతంలో మినహాయించబడిన అర్హులైన వ్యక్తులందరినీ ఈ పథకంలో చేర్చాలని అధికారులను ఆదేశించారు.

కాలియాపాణి నుంచి నౌగొడా వరకు ప్రభుత్వం రోడ్లు, నీరు, సౌర దీపాలు, ఇతర సౌకర్యాలను కల్పించింది. రోడ్ల మరమ్మతు, వీధి దీపాల ఏర్పాటు చేయడానికి ప్రణాళికలను ప్రకటించారు. 2018 సంవత్సరం నుంచి బస్సు సర్వీసులు లేకపోవడం వల్ల ఆరోగ్య సంరక్షణ, అవసరమైన సేవలు అక్కరకు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఖనిజ నిధి వనరులతో మొరాయించిన బస్సు రవాణా సౌకర్యం పునరుద్ధరణకు అధికారులకు ఆదేశించారు. ఈ నిధుల సద్వినియోగంతో గిరిజన యువతకు ఆటో రిక్షాలు అందజేయాలని స్థానిక జిల్లా కలెక్టరుకు తెలిపారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజన హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సక్రమ అమలు, ఏడాది పొడవునా నీటి లభ్యత కోసం చెరువులు వంటి జలాశయాలను నిర్మించడంపై దృష్టి సారించాలన్నారు. గత మూడేళ్లుగా గ్రామంలో మూసిన గిరిజన హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.

వీనులవిందుగా అన్నమయ్య కీర్తనల ఆలాపన



ప్రసంగిస్తున్న గుడ్ల గౌరీప్రసాద్



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

రాయగడ: అన్నమాచార్య సంకీర్తన మండలి ఆధ్వర్యంలో స్థానిక కోదండ రామ మందిర ప్రాంగణంలో సోమవారం సాయంత్రం అన్నమయ్య కీర్తనల ఆలాపన వీనులవిందుగా సాగింది. స్థానిక స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు గుడ్ల గౌరి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన కూడా పలు కీర్తనలు పాడి అలరించారు. కార్యక్రమ నిర్వాహకురాలు పి.కల్యాణి, బి.అవంతి, జి.సులేఖ, ఎ.రమ్యశ్రీ, పి.గణపతి శాస్త్రి, కె.వర ప్రసాద్, గిరీష్ పట్నాయక్, తదితరులు అన్నమయ్య కీర్తనలు పాడి వినిపించారు. భళ్లమూడి నాగరాజు వందన సమర్పణ చేశారు.

గుణుపూర్ నుంచి కటక్‌కు వాల్వో బస్ సేవలు



గుణుపూర్ నుంచి ప్రారంభమైన వాల్వో బస్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ నుంచి కటక్‌కు వాల్వో బస్ సేవలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సేవలను ఇకపై గుణుపూర్ ప్రాంత వాసులు పొందనున్నారు. గుణుపూర్ నుంచి కటక్, కటక్ నుంచి గుణుపూర్ వరకు రెండు బస్సులు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ బస్‌లో ప్రయాణించేందుకు పురుషులకు 780 రూపాయలు టిక్కెట్టు ధర నిర్ధారించగా అదేవిధంగా మహిళలు ప్రయాణిస్తే వారికి టిక్కెట్‌లో 50 శాతం రాయితీ లభించనుందని సంబంధిత శాఖ అధికారులు తెలియజేశారు. గత కొద్ది రోజుల క్రితం రాష్ట్ర గనులు, రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ జెన్న గుణుపూర్ సమీపంలోని మీనాజోల ప్రాంతంలో పర్యటించిన సమయంలో ఆయన దృష్టికి సమస్యను గుణుపూర్ వాసులు తీసుకువెళ్లారు. ఈ మేరకు స్పందించిన మంత్రి బస్ సేవలకు శ్రీకారం చుట్టడంతో ఆయకు ధన్యవాదాలు తెలియజేశారు.

కాశీపూర్‌లో వినతుల స్వీకరణ



వినతులు వింటున్న కలెక్టర్ పట్వారీ

రాయగడ: జిల్లాలోని కాశీపూర్‌లో గల సమితి కార్యాలయం సమావేశం హాల్‌లో మంగళవారం వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఫరూల్ పట్వారీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 43 వినతులను స్వీకరించారు. ఇందులో 32 వ్యక్తిగత సమస్యలు కాగా, 11 గ్రామ సమస్యలుగా గుర్తించారు. స్వీకరించిన వినతులను త్వరిత గతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పట్వారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రకాంత్ మాఝి, జిల్లా అదనపు ముఖ్య వైద్యాధికారి డాక్టర్ మమత సాహు తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా విగ్రహ ప్రతిష్ట

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి దుడుకా బహాల్‌లో నిర్మించిన మా మంగళ మందిరం, విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు సమీపంలో గల నది నుంచి శుద్ధ జలాలను కలసాలతో తీసుకువచ్చి మందిరాన్ని శుద్ధి చేశారు. అనంతరం విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



మంగళా మందిరం



కలశాలతో శుద్ధ జలాలను తీసుకువస్తున్న మహిళలు

'శాసనసభ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి'

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ ప్రత్యేక సమావేశాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడు, పొట్టంగి నియోజక వర్గం ఎమ్మెల్యే రామ చంద్ర కదమ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కోరారు. ఈ నేపథ్యంలో ఆయన లేఖ జారీ చేశారు. ఇటీవలి పహల్గామ్ ఉగ్రవాద దాడి, కొనసాగుతున్న ఆపరేషన్ సిందూర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణపై తక్షణ చర్చలు జరపాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. పరిస్థితి తీవ్రతను పేర్కొంటూ పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ అంశాలపై తక్షణ చర్చను కోరుతున్నట్లు లేఖలో వివరించారు. ప్రజా ప్రతినిధులు ఈ పరిణామాలను చర్చించడానికి, జాతీయ భద్రత, ఐక్యతపై మన నిబద్ధత పునరుద్ఘాటన నేపథ్యంలో చర్చ కోసం అసెంబ్లీ అత్యవసర సమావేశం ప్రత్యేకత సంతరించుకుందన్నారు.

శ్రీ వారి వార్షికోత్సవానికి సన్నాహాలు

భువనేశ్వర్: స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి తృతీయ వార్షికోత్సవం నిర్వహణకు చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 24న వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ నెల 20న కోయిల ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం ఖరారు చేశారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిరవధికంగా కొనసాగుతుంది. 24న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తొలి విడత వార్షికోత్సవాలు జరుగుతాయి. సాయంత్రం పూట 4.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు స్వామి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ అధికార వర్గాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ వారి అన్న ప్రసాద వితరణ నిరవధికంగా కొనసాగుతుంది.

సీబీఎస్సీ టెన్త్ ఫలితాల్లో పలువురి ప్రతిభ



స్కూల్ టాపర్ సౌమ్య మిశ్ర

జయపురం: మంగళవారం ప్రకటించబడిన సీబీఎస్సీ పదో తరగతి పరీక్షల్లో జయపురం మోడరన్ ఇంగ్లిష్ స్కూల్ వంద శాతం ఫలితాలు సాధించింది. ఆ పాఠశాల నుంచి 161 మంది పరీక్షలు రాయగా వారంతా ఉత్తీర్ణులు అయ్యారు. వారిలో సౌమ్య మిశ్ర 97 శాతం మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ పాఠశాలలో 11 మంది 90 శాతం మర్కులతో ఉత్తీర్ణులు అయ్యారని పాఠశాల వర్గాలు తెలిపాయి. పాఠశాల టాపర్ అయిన సౌమ్యమిశ్ర తాను ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో ఉన్నాని తన అభిప్రాయం వెల్లడించింది. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పాఠశాల డైరెక్టర్ శ్రీమతి కుముద మాల మహంతి హితవు పలికారు.

ఓఎస్‌ఆర్‌టీసీలో కొత్త ఏసీ బస్సులు



పాత బస్సుల స్థానంలో వేసిన కొత్త లక్ష్మీ ఎయిర్‌కండిషన్ బస్సులు



జయపురం బస్టాండ్ నుంచి బయలు దేరిన బస్సులు

జయపురం: జయపురం ఓఎస్‌ఆర్టీసీ డిపోలో పాత బస్సులు పక్కన పెట్టి ఆయా రూట్లలో కొత్త ఎయిర్‌కండిషన్ లక్ష్మీ బస్సులు ప్రవేశపెట్టారు. ఆయా రూట్లలో 10 ఎయిర్‌కండిషన్ బస్సులను నడుపుతున్నారు. ప్రయాణికులకు తక్కువ చార్జీలతో ఎయిర్ కండిషన్ బస్సులు ప్రవేశ పెట్టిన విషయం విదితమే. అయితే ప్రైవేట్ బస్సుల యజమానుల రూట్ల విషయం, టైమింగ్‌లపై అభ్యంతరం తెలపటంతో కొద్ది నెలల కిందట అవి నిలిచిపోయాయి. లక్ష్మీ ఎయిర్‌కండిషన్ బస్సులు నడిపేందుకు అనుమతి లభించటంతో నేటి నుంచి జయపురం-కాశీపూర్, జయపురం- కొటాగాం, జయపురం-పర్లాకిమిడి, జయపురం-గుణుపూర్, జయపురం-కొటియ, జయపురం- మల్కనగిరి, భవానీపట్న - మోటు వయా జయపురం, ఇంద్రావతి జానభాయి వయా జయపురం రూట్లలో కొత్త బస్సులు ప్రారంభించారు. అందుకు ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాత బస్సులలో కిలోమీటర్ కు 92 పైసలు చార్జీ ఉండగా కొత్తగా వేసిన లక్ష్మీ ఎయిర్ కండిషన్ బస్సులకు కిలోమీటర్‌కు కేవలం 55 పైసలు కావటంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కుర పంచాయతీలో స్పందన



గుమ్మా బ్లాక్ ఉక్కుర పంచాయతీ స్పందన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తదితరులు



ప్రజావినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలో గుమ్మాబ్లాక్ ఉక్కుర పంచాయతీ కార్యాలయంలో గ్రామ పరిపాలన, స్పందన కార్యక్రమానికి కలెక్టర్ బిజయ కుమార్ దాస్ విచ్చేశారు. సోమవారం ప్రభుత్వ సెలవు కారణంగా మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ జ్యోతేంద్ర కుమార్ పండా, జిల్లా పరిషత్ సీడీఎం శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు. తరబ, ఉక్కుర, గైబ, గుమ్మా పంచాయతీల నుంచి 74 వినతులు అందగా, వాటిలో గ్రామసమస్యలు 42, వ్యక్తిగతం 32 ఉన్నాయి. వాటిలో నలుగురు నిస్సహాయులకు రూ.10వేలు చొప్పున రెడ్ క్రాస్ సహాయనిధి నుంచి కలెక్టర్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ గ్రీవెన్సులో గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్, సి.డి.యం.ఓ. డా.యం.యం.ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండుగలు



కాపువీధి నుంచి ముర్రాటలు తీసుకువెళుతున్న మహిళలు

పర్లాకిమిడి: గ్రామదేవత నీలమ్మ అమ్మవారి పండుగలు కాపువీధి, సన్నాయి నాయుడు వీధిలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నీలమ్మ తల్లికి చల్లదనం చేసేందుకు పసుపునీళ్లు, వేపకొమ్మలు, ముర్రాటలో పట్టుకుని కాలేజ్ రోడ్డులో ఊరేగింపుగా మహిళలు పెద్ద ఎత్తున వెళ్లారు. అమ్మవారిని బుట్టలో పడిన తరువాత తిరిగి తమ వీధుల్లో ప్రతిష్టింపజేసి ఘటాలు తెస్తారు. మూడు రోజుల పాటు నీలమ్మ తల్లి అమ్మవారి పండుగలు ఘనంగా నిర్వహిస్తారు.



నీలమ్మ గుడికి వెళ్తున్న మహిళలు

• చందన యాత్రలో కందర్ప రథ అలంకారం

చందన పూర్ణిమ పురస్కరించుకుని చందన వేదికపై కందర్ప రథ అలంకారంలో మదన మోహనుడి దర్శనం భక్తులకు ప్రాప్తించింది. 13వ రోజు చందన యాత్ర సందర్భంగా స్వామి ఈ అలంకరణలో నావికా విహారంలో పాల్గొన్నాడు. ఈ అలంకరణ భక్తుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

- భువనేశ్వర్



• సేవా భావం

పూరీ శ్రీ జగన్నాథుని దర్శనం కోసం విచ్చేస్తున్న భక్త జనులకు స్థానిక పోలీసు యంత్రాంగం ప్రత్యేక స్వచ్ఛంద సేవలు అందజేస్తోంది. స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులకు వడదెబ్బ నుంచి ఉపశమనం కల్పించేందుకు మజ్జిగ పంపిణీ చేస్తోంది. స్థానిక సింహ ద్వార్ ఠాణా పోలీసులు భక్తులకు ఈ సేవలు అందజేస్తున్నారు. - భువనేశ్వర్



న్యూస్‌రీల్

శ్రీజగన్నాథ మందిరం నిర్మాణానికి రూ.3 లక్షలు విరాళం



శ్రీజగన్నాథ మందిరం వద్ద చెక్కును అందజేస్తున్న దాత

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో పునర్నిర్మాణంలో ఉన్న శ్రీజగన్నాథ మందిరానికి పుష్పాంజలి పాడి రూ.3,00,101 విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ కమిటీకి చెక్కును అందజేశారు.

ఘనంగా బుద్ధ జయంతి



బుద్ధ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రజలు

జయపురం: కొరాపుట్ జిల్లాలో మొదటి సారి బుద్ధ జయంతి వేడుకలు జరిగాయి. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి అవుంలి గ్రామ కూడలి వద్ద సోమవారం సాయంత్రం వేడుకలు చేశారు. అవుంలి పార్క్ లోగల భారీ బుద్ధ విగ్రహానికి పూజలు చేశారు. శాంతి, అహింస, ధర్మం, కారుణ్యం తదితర విలువలు బోధించారు. ఉత్సవంలో అవుంలి సర్పంచ్ హీరామణి పూజారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.


20న అఖిల భారత సమ్మె



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు

పర్లాకిమిడి: ఈ నెల 20వ తీదీన రాష్ట్ర వ్యాప్తంగా అఖిల భారత సమ్మెను ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక దండుమాలవీధిలో సీపీఎం కార్యాలయంలో అఖిల భారత కిసాన్ సభ నాయకులు బంగారయ్య, బి.కె.ఎం.యు రాష్ట్ర కమిటీ సభ్యులు జోన్న సుభాష్ చంద్రరావు, టి.యు.సి.సి పైల మురళీకృష్ణ, ఏ.ఐ.కె.ఎం.ఎస్ కేదార్ శబర, ఏ.ఐ.టి.యు.సి కార్యదర్శి దండపాణి రయితో, శ్రీనివాస్ బెహరా తదితరులు పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని, పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని, స్కీమ్ వర్కర్లకు శ్రామిక హోదా ఇవ్వాలని, నిత్యావసర వస్తువులు అందించాలని, పలు డిమాండ్లతో ట్రేడ్ యూనియన్లు సమ్మె చేయనున్నాయని జోన్న సుభాష్ చంద్రరావు తెలిపారు. సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

250 కిలోల గంజాయి స్వాధీనం



బలిమెల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి పాతచిమాటపల్లి పంచాయతీ బండిగూఢ గ్రామంలో అడవిలో పది బస్తాల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయిపై ముందస్తు సమాచారం అందడంతో ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ సోమవారం సాయంత్రం సిబ్బందితో దాడి చేశారు. దీంతో మాఫియా అంతా పరారైపోయింది. పది బస్తాల్లో 250 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ: చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసులు మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి పికప్ వ్యాన్, 4 ఫోన్లు, 48 హెచ్‌బీఎల్ డ్రై సెల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నింతులను కోర్టుకు తరలించారు. నిందితుల వివరాలను వెల్లడించలేదు.

క్లుప్తంగా

నలుగురిపై గృహ హింస కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామానికి చెందిన అనిత ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు మంగళవారం ఆమె భర్త ముత్యాలరావు, ముగ్గురు కుటుంబ సభ్యులపై గృహహింస కేసు నమోదు చేశారు. భార్యభర్తలు మధ్య ఇటీవల గొడవలు రావడం, భర్త అప్పులు చేయడం, కన్నవారి ఇంటి నుంచి డబ్బులు తీసుకు రావాలని ఒత్తిడి తీసుకురావడం వంటి కారణాలతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2019లో అనితకు వివాహం కాగా, కుమార్తె ఉంది. ప్రస్తుతం కన్నవారు ఇంటి వద్ద దుప్పలవలసలో ఉంటోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

108 అంబులెన్సులో ప్రసవం



జన్మించిన శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

మందస: మండలంలోని సింగుపురం గ్రామానికి చెందిన రాయవలస భారతి 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు మంగళవారం జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. భారతి పురిటి నొప్పులతో బాధపడుతుండగా వారి బంధువులు 108కు సమాచారం అందించారు. దీంతో మందస 108 సిబ్బంది ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ ఎస్.రాజేంద్ర ప్రసాద్‌లు గ్రామానికి హుటాహుటిన చేరుకున్నారు. అనంతరం ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గ మధ్యలో పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో ఆమెకు సిబ్బంది ప్రసవం చేయడంతో ఆడ శిశువుకి జన్మనిచ్చింది. అనంతరం హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతి చెందిన చిన్నారమ్మ

కొత్తూరు: మండలంలోని దిగువ మల్లెలుగూడకు చెందిన యువతి సవర చిన్నారమ్మ (30) పిడుగుపాటుకు మృతి చెందినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ మంగళవారం తెలియజేశారు. చిన్నారమ్మ మేకలు కాపుకు వెళ్లగా సోమవారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి తమ్ముడు సవర రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

కారు బోల్తా

రణస్థలం:మండలంలోని విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు పైడిపేట జాతీయ రహదారిపై మంగళవారం బోల్తా పడింది. అయితే కారులో ఉన్నవారికి చిన్న,చిన్న గాయా లు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడినప్పుడు జాతీయ రహదారిపై నీరు నిలబడిపోవడం వలన కారు బోల్తా పడిందని, తరుచూ ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. దీనిపై జేఆర్‌పురం పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి గ్రామ సమీపంలో ఉన్న రైల్వే వంతెన కింద గంజాయితో ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశామని రణస్థలం సీఐ అవతారం మంగళవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. వాండ్రంగి గ్రామానికి చెందిన మీసాల జగన్నాథరావు, శ్రీకాకుళం వాంబే కాలనీకి చెందిన యారగళ్ల పవన్ కుమార్‌లు ద్విచక్రం వాహనం ద్వారా 2 కేజీల 300 గ్రాముల గంజాయి తరలించేందుకు ఉండగా స్థానిక ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. అలాగే గంజాయి విక్రయిస్తున్న కరిజాం లచ్చన్న, మీగడ గోపిల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నాని వెల్లడించారు. వీరిని త్వరలోనే అరెస్టు చేసి విచారిస్తామన్నారు.

ప్రకాశం జిల్లాలో బస్సు ప్రమాదం

- క్షతగాత్రుల్లో జిల్లాకి చెందిన ముగ్గురు వ్యక్తులు

పోలాకి: ప్రకాశం జిల్లా తిమ్మనాపాలెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. చెన్నై నుంచి వస్తున్న బస్సు ఎదురుగా ఉన్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే ఉత్తరాంధ్రకు చెందిన ఎరువుల డీలర్లను కేపీఆర్ కంపెనీ మహాబలిపురంలో ఈనెల 12వ తేదీన జరిగిన బిజినెస్ మీటింగ్‌కు మూడు బస్సుల్లో తీసుకెళ్లింది. తిరిగి వస్తుండగా అందులో ఒక బస్సు ప్రమాదానికి గురైంది. కేపీఆర్ కంపెనీ శ్రీకాకుళం ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో పాటు నరసన్నపేట, సంతకవిటికి చెందిన ఇద్దరు డీలర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు సంఘమిత్ర ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన అంత్యక్రియలు



శ్రీకాకుళం రూరల్: గురజాడ విద్యాసంస్థల్లో మూడు దశాబ్దాలుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పులఖండం శ్రీనివాసరావు అంత్యక్రియలు మంగళవారం స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడుతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఒక సాహితీవేత్తను, పరిపాలన దక్షుడిని కోల్పోవడం బాధగా ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. వీరితో పాటు విద్యాసంస్థల డైరెక్టర్ రంగారావు, వి.మహేష్, ఐక్యూ ఏసీ మర్తాండ తదితరులు సంతాపం ప్రకటించారు.

నవ్వించడం ఒక కళ



రాయగడ: సమావేశంలో పాల్గొన్న క్లబ్ కార్యవర్గ సభ్యులు

రాయగడ: నవ్వించడం ఒక కళ అని, నవ్వడంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని స్థానిక ప్రేమ్ పహాడ్ లాఫర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు మహంతి అన్నారు. మంగళవారం క్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవ్వడం, నవ్వించడం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటైన లాఫర్స్ క్లబ్ ఆ దిశగా భవిష్యత్ ప్రణాళికలతో కార్యక్రమాలను రూపొందించాలన్నారు. ప్రతీ వారం కనీసం ఒక ప్రాంతంలో ఇటువంటి తరహా నవ్వుల కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అందుకు సభ్యులంతా సుముఖత వ్యక్తం చేశారు. నవ్వు వల్ల కలిగే లాభాలు వంటి అంశాలతో ర్యాలీలను నిర్వహించి చైతన్య పరిచేందుకు సభ్యులు సహకరించాలన్నారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి లాల్ బిహారి లెంక, దశరథి రాజ్‌గురు, అభిమన్యు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

జయపురంలో..

జయపురం: స్థానిక బిజూపట్నాయక్ శాంతి ఉద్యానంలో విద్యార్థులతో నవ్వుల కార్యక్రమం నిర్వహించారు. బలంగీర్ జిల్లాలో ప్రసిద్ధ సంస్థ నిర్ఝరిణ నిర్వహించిన నవ్వుల కార్యక్రమాన్ని ఆ సంస్థ కార్యదర్శి బిరంచి నారాయణ దాస్ పర్యవేక్షించారు. ముఖ్యఅతిథిగా అధ్యాపకులు డాక్టర్ సుధాంశు శేఖర పట్నాయక్ హాజయ్యారు. నవ్వటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, బెలూన్లతో ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనంలో అరూష్ పట్నాయక్ ప్రథమ బహుమతి, అభిప్స ద్వితీయ బహుమతి సాధించారు. భారత సైనికులు చేపట్టిన సిందూర్ ఆపరేషన్‌పై ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. గౌరవ అతిథిగా సమాజసేవి ప్రమోద్ కుమార్ రౌళో, అభినేష్ శాంతపాత్రో, అంశిత్ పట్నాయక్, అంశుమాన్ పండా, అర్ణభ పట్నాయక్, అభిస్ప సాహు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు ఆమోదం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చక్కని వెసులుబాటు కల్పించింది. స్థానిక శాసన సభ, లోక్ సభ లేదా రాజ్యసభ సభ్యుల సిఫారసు పత్రాల ఆధారంగా ఐచ్ఛిక ప్రాంతాలకు బదిలీ పొందే అవకాశం కల్పించారు. పరిమిత నిబంధనలతో ఈ అవకాశం అక్కరకు వస్తుంది. ప్రజా ప్రతినిధి నియోజకవర్గ పరిధిలోని 15 మంది వరకు అర్హులైన ఉపాధ్యాయ బదిలీ అభ్యర్థనల్ని సిఫారసు చేసేందుకు అవకాశం కల్పించారు. తమ సిఫారసులను సంబంధిత జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేసే విచక్షణాధికారాన్ని కల్పించడం విశేషం. రాష్ట్రంలో ప్రాథమిక మరియు మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుంది.ఈ మేరకు రాష్ట్ర పాఠశాలలు మరియు సామూహిక విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి గిరీష్ చంద్ర సింగ్, మాధ్యమిక విద్యా విభాగం డైరెక్టర్ మరియు ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు.ఉపాధ్యాయుల బదిలీ వ్యవహారాల్ని జిల్లా స్థాయి బదిలీ కమిటీ (డీఎల్‌టీసీ) ప్రత్యక్షంగా పరిశీలిస్తుంది. బదిలీ హేతుబద్ధీకరణ సూత్రాన్ని ఉల్లంఘించకూడదు.

అత్యవసర అవసరాలు ఉన్న ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఏ ఉపాధ్యాయుడిని గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి బదిలీ చేయకూడదు.ఈ విచక్షణాధికారం జిల్లా పరిధి లోపల బదిలీలకు మాత్రమే వర్తిస్తుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ ప్రతిపాదనలను సంబంధిత జిల్లా కలెక్టర్ లేదా నోడల్ కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. డీఎల్‌టీసీ ఆధ్వర్యంలో చర్యలు చేపడతారు. రాజ్యసభ ఎంపీల విషయంలో సిఫారసు జాబితాను రాష్ట్ర మాధ్యమిక విద్యా శాఖ డైరెక్టర్‌కు దాఖలు చేయాల్సి ఉంటుంది. సంబంధిత కలెక్టర్లు ఈ సిఫారసు అభ్యర్థనల్ని పరిశీలించిన మేరకు చర్యలు చేపడతారు. ఈ అవకాశం ఈ ఒక్క సీజనుకు మాత్రమే పరిమితం. ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే వర్తిస్తుంది. ఈ నెల 15 నుంచి జూన్ 15 వరకు మాత్రమే ప్రజా ప్రతినిధుల సిఫారసుల్ని పరిగణనలోకి తీసుకుంటారని స్పష్టం చేశారు.

సికరపాయిలో చోరీ

- వృద్ధ దంపతులపై దాడి చేసిన దుండగులు
- బంగారం, వెండి నగలు అపహరణ



దుండగులు విరగ్గొట్టిన బీరువ



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

రాయగడ: వృద్ధ దంపతులపై దొంగలు దాడి చేయడంతోపాటు దోపిడీకి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటన సోమవారం అర్ధరాత్రి జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సికరపాయిలో చోటు చేసుకుంది. ఇంట్లోకి చొరబడిన దుండగులు వృద్ధ దంపతులపై మరణాయుధాలతో దాడి చేసి ఇంట్లోగల నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానిక క్లూస్‌టీంతో చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సికరపాయిలో నివశిస్తున్న గొపాలశెట్టి ఉపేంద్ర ఇంటిలోకి దాదాపు పది మంది గుర్తు తెలియని దుండగులు చొరబడి దాడి చేశారు. వారికి మరణాయుధాలను చూపించి బెదిరించి బీరువాలో ఉంచిన సుమారు 14 తులాల బంగారు ఆభరణాలు, 11 కిలోల వెండి ఆభరణాలు దొంగిలించుకుని వెళ్లిపాయారు. దుండగుల దాడిలో స్వల్పగాయాలపాలైన ఉపేంద్ర అతని భార్య దుండగులు వెళ్లిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. రాయడ ఎస్‌డీపీవో గౌరహరి సాహు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని ఎస్‌డీపీవో సాహు తెలిపారు.

సీఎస్ అధ్యక్షతన కార్యదర్శుల సమావేశం



చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ప్రభుత్వ శాఖల ప్రముఖ కార్యదర్శుల ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: స్థానిక ఖారవేల భవన్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ ఆహుజా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రముఖ కార్యదర్శులు హాజరయ్యారు. ప్రజాహిత పథకాల అమలు, సిబ్బంది సంక్షేమం, సాంఘిక భద్రత కార్యకలాపాల్ని ఈ సమావేశంలో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ కొత్త పథకాల అమలు, వివిధ విభాగాలలో ఖాళీ పోస్టుల భర్తీ, ప్రభుత్వ ఉద్యోగులకు సముచిత పదవీ విరమణ ప్రయోజనాలు, ఫించను మంజూరు వంటి అంశాల్ని కార్యదర్శులతో చర్చించారు.

కార్యదర్శుల జిల్లా సందర్శనలు, తదనంతర నివేదికల రూపకల్పన వంటి కీలకమైన అధికారిక చర్యల్ని ప్రముఖ కార్యదర్శి సమీక్షించారు. ఈ సమావేశానికి అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్, అదనపు ప్రధాన కార్యదర్శులు సత్యబ్రత సాహు, సురేంద్ర కుమార్ మరియు హేమంత్ శర్మలతో పాటు వివిధ శాఖల ప్రముఖ కార్యదర్శులు, కమిషనర్లు మరియు కార్యదర్శులు హాజరై చర్చలలో పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త..!

- పెరుగుతున్న పిడుగుపాటు ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న పిడుగులు
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు



పిడుగుపాటుకు మృతి చెందిన మేఘన(ఫైల్)



పిడుగుపాటుకు మృతి చెందిన అప్పన్న (ఫైల్)

సరుబుజ్జిలి: వేసవిలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరడంతో పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాలో ఇటీవల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. అయితే పలుచోట్ల పిడుగులు పడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మనుషులతో పాటు మూగజీవాలు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో పిడుగు మాట వింటేనే ప్రజలు భయపడుతున్నారు. పొలాల్లో పనులు చేసుకొనే రైతులు, పశువుల కాపరులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే సమీప ప్రాంతాల్లో ఇళ్లకు సమీపంలో పిడుగులు పడుతుండడంతో గృహోపకరణాలు కాలిపోయి తీవ్ర నష్టాలు ప్రజలు చవిచూస్తున్నారు. దీంతో పిడుగుపాటు ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి పలు సూచనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇలా చేయకూడదు

- వర్షం కురిసేటపుడు చెట్లకింద ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల్లో ఉండరాదు.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లలో లేదా అంతకన్న తక్కువ సమయంలో ఉరుము విని పిస్తే మనకు 10 కిలోమీటర్ల దూరంలోపు పిడుగుపడే అవకాశముంది.
- మెరుపు కనబడిన తర్వాత 30 నిమిషాల పాటు బయటకు వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతుల్లో సెల్‌ఫోన్లు లేకుండా చూసుకోవాలి, సెల్‌ఫోన్ ఉంటే స్విచ్ఛాఫ్ చేయాలి.
- ఒక వేళ ఇవి ఉంటే రేడియన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశముంటుంది.
- వర్షంపడే సమయంలో విద్యుత్ తీగలు కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు.
- అలాగే అటువంటి సమయాల్లో చెప్పులు లేకుండా బయటకు వెళ్లరాదు.
- గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు మెరుపులు, ఉరుములతో భయందోళనకు గురవుతారు. అటువంటి వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రథమ చికిత్స చేయాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడిబట్టలు తీసి వేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను 1 అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించాలి.

– బమ్మిడి జ్యోతిర్మయి, వైద్యాధికారి, పురుషోత్తపురం పీహెచ్‌సీ

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకుల డిమాండ్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేవీఆర్ నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు పీఆర్‌కే రావు, జిల్లా కార్యదర్శి వై.అప్పయ్యలు కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని డీపీటీవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనాలని, 114 జీవోలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150ల నుంచి రూ.400ల వరకు చెల్లింపులు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని విన్నవించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఉన్న విధంగానే క్యాడర్‌ను బలోపేతం చేయాలని, తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు.

మత్స్యకార గ్రామాల్లో కూటమి చిచ్చు



మాట్లాడుతున్న పేరాడ తిలక్

- కక్ష సాధింపులకు ప్రతి చర్యలు తప్పవు
- అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు సరికాదు
- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్

సంతబొమ్మాళి: ప్రశాంతంగా ఉండే మత్స్యకార గ్రామాల్లో కూటమి పార్టీలు చిచ్చుపెడుతున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. మండలంలోని జగన్నాథపురం తీరప్రాంత గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామంలో అక్రమ కేసుల బాధితులైన సర్పంచ్ జోగి రాములమ్మ, ఉప సర్పంచ్ కొమర రామారావు, లండ రామారావులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ఎదుటివారిని భయభ్రాంతులను గురి చేస్తున్నారన్నారు. మహిళ సర్పంచ్ జోగి రాములమ్మపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలు గొడవపడితే ఎటువంటి సంబంధం లేని వైఎస్సార్‌సీపీ నాయకులపైన, ఆ సమయంలో గ్రామంలోనే లేని సర్పంచ్ రాములమ్మపైన అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు.

సీఐ నిర్వాకంతోనే అక్రమ కేసులు

టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు నిర్వాకం వలనే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదవుతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దయ్యబట్టారు. మంత్రి అచ్చెన్నాయుడు తమకు కావాల్సినవారిని అన్ని శాఖల్లో నియమించుకొని తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీకు చెందిన నాయకులను ఆర్థికంగా నష్టపరిచేలా వ్యవహరిస్తున్నారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పుడు పనులు చేసే అధికారులను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఆర్థికంగా నష్టపరిచినా, అక్రమ కేసులు బనాయించినా భయపడకుండా పార్టీకి అండగా నిలిచిన సర్పంచ్ రాములమ్మ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆదర్శమని కొనియాడారు. టీడీపీ నాయకుల దాడులకు ప్రతిచర్య తీవ్రంగా ఉంటుందన్నారు. కింజరాపు కుటుంబీకులు అక్రమంగా సంపాదించిన వేల కోట్లను జిల్లా ప్రజలందరికీ తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రామిరెడ్డి, ఎన్ని మన్మథరావు, చింతల రాజులు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపతిరావు హేమసుందర రాజు, అట్ల రాహుల్, సత్తారు సత్యం, కాళ్ల సంజీవ రావు, పుక్కల లక్ష్మణరావు, మురళి పాల్గొన్నారు.

ఔషధ గుణం..

ఆరోగ్య ప్రదం





ముంజులను విక్రయిస్తున్న రైతు

- తాటి ముంజలతో శరీరానికి పుష్కలంగా విటమిన్లు
- వేసవిలో డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం
- కామెర్లు, ఎసిడిటీ తీవ్రతను తగ్గించే గుణం

వజ్రపుకొత్తూరు:

వేసవి తాపాన్ని అధిగమించేందుకు, ఈ కాలంలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతులను నివారించి ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన వరం తాటి ముంజలు. ఇవి ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి. తాటి ముంజల సీజన్ ప్రారంభం కావడంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ తాటి ముంజులు శరీరంలోని చెక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటికి గిరాకీ పెరిగింది. ఇదివరకు గ్రామీణ ప్రాంతాల్లో తాటిచెట్లు అధికంగా ఉండేవి. అయితే ప్రస్తుతం రియల్ ఎస్టేట్ కారణంగా మారుమూల గ్రామాల్లో సైతం తాటి చెట్లు నరికేస్తుండడంతో భవిష్యత్‌లో ఇవి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన ఉంది.

– ఆరోగ్య ప్రదాయిని

ప్రకృతిలో విరివిగా లభ్యమయ్యే తాటి ముంజులు కల్తీ లేనివి, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయినిగా భావిస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో తాటి ముంజులు సేకరించేవారు కరువయ్యారు. దీంతో మైదాన ప్రాంతాల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతు కూలీలు తాటి ముంజులను పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. జిల్లాల్లోని శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, హరిపురం, ఇచ్ఛాపురం పట్టణాల్లో ఎక్కువగా విక్రయాలు చేపడుతున్నారు. తాటి ముంజుల పరిమాణాన్ని బట్టి డజను రూ.80ల నుంచి రూ.120ల వరకు విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా తాటి ముంజుల ప్రియులు విశేషంగా కొనుగోలు చేస్తున్నారు.



తాటిముంజులు

ప్రయోజనాలు

- తాటి ముంజుల్లో విటమిన్లు, పాస్పరస్, థయామిన్, బీ–కాంప్లెక్స్, కాల్షియం, పొటాషియంతో పాటు సోలేబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండడం వల్ల డీహైడ్రేషన్‌ల నుంచి ఉపశమనం లభిస్తుంది. వేసవి తాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. వికారం, వాంతులను నివారిస్తుంది.
- తాటి ముంజులు తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు రక్తపోటు(బీపీ)ను అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా సీజన్లో క్రమం తప్పకుండా తాటి ముంజలను తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకుని మంచి కలెస్ట్రాల్‌ను వృద్ధి చేసుకోవచ్చు.
- వీటిలో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో పోషకాలు ఉండడం వలన అలసట, నిర్జలీకరణం నుంచి ఉపశమనం కల్పించి శరీరం బరువు పెరగకుండా చేస్తుంది.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గించి, జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది.
- ఆహారంలో సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటీ, ఉదర సంబంధ సమస్యల నివారణకు దోహదపడుతుంది.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్ నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- తాటి ముంజులను గుజ్జుగా చేసి ముఖానికి పూతలా వేస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. చర్మానికి కావాల్సినంత తేమను అందించి చెమట కాయలను నివారిస్తుంది. ఎండ వేడిమికి ముఖంపై ఏర్పడే మచ్చలను తగ్గిస్తుంది. పోషకాలు అధికంగా ఉండడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంచి ఎసిడిటీ, కామెర్ల తీవ్రతను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.

మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది



తాటి ముంజలు మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. లేతవి, జెల్లీలా ఉన్నవి తింటే రుచిగా ఉంటాయి. మా ఊరులో ఉన్న చెట్లు నుంచి గెలలను తీసి కోసుకుని తింటాం. పైగా వేసవిలో చల్లదనం ఇచ్చి దాహార్తిని తీరుస్తుంది. సరదాగా గడుపుతూ తోటల్లోకి చేరి, కొండ పక్కన ఉన్న తోటల్లో తాటిచెట్లు నుంచి కాయలను తీసి కుర్రాళ్లమంతా పంచుకుని తింటాం. అదో తియ్యని జ్ఞాపకం.

– డి.ఢిల్లీరావు , అమలపాడు, వజ్రపుకొత్తూరు

ఏడాదికి ఒక్కసారైనా తినాలి



తాటి ముంజ కల్తీలేని స్వచ్ఛమైన పోషకాహారం. వేసవి నుంచి వర్షాకాలం ప్రారంభం వరకు తాటి ముంజులు లభ్యమవుతాయి. ఇవి తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందనడంలో సందేహం లేదు. మా ప్రాంతంలో కోసేవారు లేకపోవడంతో ఇచ్ఛాపురం, హరిపురం పలాస, టెక్కలి, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి తెప్పించుకుని తింటాం. కొన్నిసార్లు పలాస– విశాఖ పాసింజర్ ట్రైన్లలో సైతం విక్రయాలు చేస్తుంటారు. అలాంటి సమయాల్లో ఎక్కువ తీసుకుంటాం. ఐస్ యాపిల్‌గా పిలిచే తాటి ముంజలను ఏడాదికి ఒకసారైనా తిలనాలని కోరిక ఉంటుంది.

– ఎం.కృష్ణారావు, బ్రాహ్మణతర్ల, పలాస

ఉక్కపోతతో షాక్

- లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ప్రమాదం
- వైరింగ్‌లో ప్రమాణాలు అవసరం


పార్వతీపురం: వేసవి తీవ్రత దృష్ట్యా రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలు, మరోవైపు ఉక్కపోత నుంచి ఉపశమనానికి విద్యుత్ ఉపకరణాల వినియోగం రెండింతలవుతుంది. ఇంత వరకు బాగానే వున్నా విద్యుత్‌ను అధికంగా వినియోగించడంతో విద్యుత్ వైర్ల సామర్థ్యం పరిశీలించాలి. విద్యుత్ వైర్లను సరైన ప్రమాణాలతో, తగిన మందంతో వున్న వైర్లను వేశారా.. లేదా.. అనేది గుర్తించాలి. విద్యుత్ వైర్లలో ఏవైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూటయ్యే ప్రమాదం వుంది. ప్రస్తుతం అగ్నికర్తెలు నడుస్తున్న తరుణంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్న తరుణంలో విద్యుత్ వినియోగదారులు ఎంతో కొంత అప్రమత్తతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. లేకుంటే ప్రమాదాల బారిన పడక తప్పదు.

ఇలా చేయొద్దు..

- గృహంలో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ వినియోగిస్తే పరికరాలు తీగలు కాలిపోయే ప్రమాదం ఉంది.
- ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదం జరిగే అవకాశం వుంది.
- ఎండలో విద్యుత్ తీగలుంచితే భవిష్యత్‌లో తీగలపై ఉన్న రబ్బరు మెత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- ఇంట్లో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నీ ఆన్ చేసి ఉంచడం వల్ల అధిక లోడ్‌కు లోనయ్యే అవకాశం వుంది.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందర వందరగా ఉంచవద్దు.
- రక్షణ పరికరాలైన ఎంసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫీజులను బైపాస్ చేయకూడదు.

అధిక లోడ్‌తో అనర్థమే..

వేసవిలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లోగాని, కార్యాలయాల్లోగాని వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకొని ఆ మేరకు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో అందుబాటులో ఉంచుతుంది. ఎవరైనా వినియోగదారులు ఒక కేవీ లోడ్‌ను మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయే అవకాశం కూడా ఉంది. వినియోగదారులంతా వాడుతున్న లోడ్‌కు అనుగుణంగా అనుమతి పొందితే విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు.


విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన బోర్డు

జాగ్రత్తలు ఇలా...

- ✔ వేసవి కాలం ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ప్రతీ ఒక్కరు ఇళ్లు, కార్యాలయాలను ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.
- ✔ ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్ శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి. అందుకు తగినట్టుగా వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఒవెన్‌లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి.
- ✔ విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ ఉన్న విద్యుత్ పరికరాలను ఉపయోగించాలి.
- ✔ ఎలక్ట్రికల్ ఉపకరణాన్ని బట్టి దానికి అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
- ✔ నాసిరకం విద్యుత్ పరికరాల వల్ల విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో పాటు విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- ✔ గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడేంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ✔ ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పని చేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉండేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, రాళ్ల ఉప్పు ఉపయోగించాలి.
- ✔ విద్యుత్ ఉపకరణాలకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- ✔ విద్యుత్ స్తంభం నుంచి మీటరు వరకు ఉండే సర్వీసు వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలి.
- ✔ ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఇతర ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్‌ను వినియోగించాలి.

అప్రమత్తంగా ఉండాలి

వేసవి కాలంలో విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉన్నందున షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్ చేయించుకోవాలి. విద్యుత్ సరఫరాలో లోపాలు ఉంటే వెంటనే సమీప లైన్‌మేన్‌కు తెలియజేసి సరిచేసుకోవాలి.

– రామారావు,
ఏఈ, విద్యుత్ శాఖ, పార్వతీపురం

ఏపీ క్రెడయ్ చాప్టర్‌లో చంద్రబోస్‌కి కీలక బాధ్యతలు

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రెడయ్ చాప్టర్ నూతన కార్యవర్గ ఎన్నికలో విజయనగరం జిల్లాకు చెందిన కట్టూరు సుభాష్ చంద్రబోస్ కీలక బాధ్యతలు చేపట్టారు. మంగళవారం విజయవాడలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సమక్షంలో 2025–27 సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా విజయనగరానికి చెందిన సుభాష్ చంద్రబోస్ క్రెడయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా క్రెడయ్ ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కన్వీనర్‌గా, జీఎస్టీ కన్వీనర్‌గా, సెంటర్ జోన్ ఇంచార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరానికి చెందిన తనకి క్రెడయ్ ఏపీ చాప్టర్‌లో కీలక బాధ్యతలు అప్పగించటం సవాల్‌గా స్వీకరిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో నిర్మాణ రంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. వ్యవసాయం తరువాత అధికంగా ఉపాధి పొందే నిర్మాణ రంగంలో పూర్తి స్థాయిలో సేవలందిస్తానని చెప్పారు. నిర్మాణ రంగ కార్మికుల నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేలా ముందుకు వెళతానన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు.


సుభాష్ చంద్రబోస్

మన క్రీడా విధానం దేశానికే ఆదర్శం

- చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యత
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం: క్రీడా విధానంలో మనం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఒక్క మన రాష్ట్రంలోనే ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించామని, క్రీడల కోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని చెప్పారు. చదువుతో పాటు ఆటలకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతున్న 3వ జాతీయ తైక్వాండో శిక్షణా సెమినార్‌కు మంత్రి శ్రీనివాస్ మంగళవారం హాజరయ్యారు. క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణను తిలకించారు. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోచ్‌లు, క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, మానవ వనరులే మన దేశానికి ఆస్తి అని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు, ఆటల్లో కూడా రాణించి మన రాష్ట్రానికి, ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.వేణుగోపాల్, అంతర్జాతీయ క్రీడాకారుడు, తైక్వాండో కోచ్ అబ్బాస్ షేక్, తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీహరి, మక్కువ శ్రీధర్ తదితర ప్రముఖులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వైభవంగా పైడితల్లమ్మ దేవర మహోత్సవం

- వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో భక్తజనం
- 19న తొలేళ్లు, 20 అమ్మవారి పండగ

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామదేవత పైడితల్లమ్మ పండగ సందర్భంగా మంగళవారం దేవర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం గ్రామానికి చెందిన పెద్దవీధి చేనేత కార్మికులు 42 అడుగులు, చిన్నవీధివారు 40 అడుగుల ఎత్తులో ప్రభలను ఊలుతో అలంకరించారు. వేపాడ, వల్లంపూడి జంటగ్రామాల్లో ప్రభలను ఊరేగింపు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం ప్రాంగణ సమీపంలో రెండు ప్రభలను నిలిపారు. 19న తొలేళ్ల ఉత్సవం రోజు ఊలు అలంకరణ మార్పుచేసి నిలపనున్నారు. 20న అమ్మవారి పెద్దపండగ జరగనుంది.


వల్లంపూడి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన ప్రభలు


వల్లంపూడి-వేపాడ గ్రామాల్లో ప్రభలను ఊరేగిస్తున్న భక్తులు

ఆదర్శనీయులు... ఆ దంపతులు

- అతడు ఉపాధ్యాయుడు.. ఆమె వీఆర్‌వో
- అవయవ దానానికి అంగీకార పత్రాల అందజేత

చీపురుపల్లి: ఆదర్శం అంటే అదేదో మాటల్లో చెప్పేది కాదు చేతల్లో చూపించాలి. అందులోనూ నేత్రదానం అంటేనే భయపడిపోతున్న ఈ రోజుల్లో ఏకంగా అవయవదానం అంటే మరి ఎంత కాదనుకున్నా కాస్త భయం లేకపోలేదు. అయినప్పటికీ ప్రతీ మనిషి మరణానంతరం మిగిలేది బూడిదే కదా.. అయినా ఎందుకు అవయవ దానం చేయడానికి భయం అంటూ ప్రతీ ఒక్కరూ మాట్లాడుతుంటారు. కానీ అవయవదానం చేసేందుకు ముందుకు రావడానికి మాత్రం అడుగులు వేయరు. ఇలాంటి నేపథ్యంలో ఆ దంపతులు ఇద్దరూ ఒకే ఆలోచన చేసి ఒక నిర్ణయానికి వచ్చారు. తమ మరణానంతరం అవయవ దానం చేసేందుకు సిద్ధం అంటూ ముందుకొచ్చారు. అంతేకాకుండా తమ మరణానంతరం అవయవ దానం చేయడానికి తాము సిద్ధమే అంటూ మానవీయత స్వచ్ఛంద సంస్థ సిద్ధం చేసిన అంగీకార పత్రాలపై సంతకాలు చేసి అందజేసి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలిచారు. వారే నెలిమర్ల మండలంలోని తంగుడుబిల్లికి చెందిన శివుకు బంగారయ్య, రామలక్ష్మి దంపతులు. బంగారయ్య తంగుడుబిల్లి గ్రామంలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తుండగా, రామలక్ష్మి విజయనగరం కంటోన్మెంట్ వీఆర్వోగా పని చేస్తున్నారు. బంగారయ్య ఆయన భార్యతో కలిసి ఎంతో గొప్పగా ఆలోచన చేసి తమ మరణానంతరం శరీరం మట్టిలో కలిసిపోకుండా మరికొంత మందికి ఉపయోగపడాలనే గొప్ప ఆలోచనతో అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బివి.గోవిందరాజులు, ప్రతినిధి విజయతో బాటు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పి.సుధీర్‌కు మంగళవారం అంగీకార పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతటి గొప్ప వారి శరీరమైనా మట్టిలో కలిసిపోవాల్సిందేనని అలా కాకుండా అవయవదానం చేయడం ద్వారా మరికొంత మందికి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.


అవయవదానానికి అంగీకార పత్రాలు అందజేస్తున్న దంపతులు

విజయలక్ష్మికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.విజయలక్ష్మికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు దక్కింది. విజయవాడకు చెందిన హెల్త్ కేర్ ట్రస్టు ప్రతీ ఏటా ఉత్తమ సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్స్‌ల కోసం నిర్వహిస్తున్న అవార్డులు ఎంపికలో భాగంగా ఈ ఏడాది జిల్లా నుంచి కర్లాం స్టాఫ్ నర్స్ విజయలక్ష్మికి అవకాశం లభించింది. ఈ మేరకు త్వరలో విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోనున్నారు. దీంతో ఆమెను పీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది అభినందించారు.


ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికైన విజయలక్ష్మి

అరటి పంటకు నష్టం

చీపురుపల్లి: మండలంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి పంటకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పీకే పాలవలస, పేరిపి, గొల్లలములగాం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో ఎనిమిది ఎకరాల్లో అరటి పంట, మూడు ఎకరాల్లో బొప్పాయి పంట నేలకొరిగినట్టు ఆయన తెలిపారు.

భూముల వివరాల పరిశీలన

లక్కవరపుకోట : అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల వర్తింపుకై రైతులకు సంబంధించి భూముల వివరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్టు ఏవో స్వాతికుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రైతు తన భూమికి సంబంధించిన 1 బీ, ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబరుతో సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్తే.. అక్కడ సిబ్బంది సంబంధిత పత్రాలను పరిశీలన చేసి నమోదు చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. అలాగే పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగా, కట్టి జనుము, పిల్లి పెసర విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

జీవనోపాధికి విస్తృతంగా రుణాలు

- మెప్మా పీడీ చిట్టిరాజు

బొబ్బిలి రూరల్: పొదుపు సంఘాల్లోని సభ్యులకు జీవనోపాధిని కల్పించేందుకు విస్తృతంగా బ్యాంకర్ల సహకారంతో లింకేజీ రుణాలందిస్తున్నామని, ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకుంటామని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గంటా వెంకట చిట్టిరాజు తెలియజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మెప్మా పరిధిలో 2వేల 602 సంఘాలుండగా వాటికి రూ.275 కోట్లను రుణాలుగా అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటికే 244 సంఘాల సభ్యులకు దాదాపు 25 కోట్ల రూపాయిలను రుణాలుగా అందించామన్నారు. ప్రతి సభ్యునికి రెండు లక్షల వరకు వ్యక్తిగత రుణాలందిస్తున్నామని, చిన్నతరహా వాణిజ్య, వ్యాపారాలకు అవసరమైన మొత్తాలను పూర్తి స్థాయిలో అందించేందకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సంఘంలోని ప్రతి సభ్యురాలి వివరాలు ఆన్‌లైన్ చేశామని ఈ విధానం వల్ల నిధులు దుర్వినియోగం కావన్నారు. కొత్తగా 160 సంఘాలను తయారు చేయగా 304 పాత సంఘాలను అప్‌గ్రేడ్ చేశామని వివరించారు. రిక్షా, ఆటో, ఇతర రంగాల్లో ఉన్న కార్మికులను, పురుషులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారితో ఐదుగురు చొప్పున సంఘాలను ఏర్పాటు చేస్తున్న వారి జీవనోపాధికి అవసరమైన రుణాలనందించేందుకు బ్యాంకర్లతో సమావేశాలు జరుపుతున్నామని తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న మెప్మా పీడీ చిట్టిరాజు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు


డిమాండ్ల సాధనకై ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నేతలు, కార్మికులు

- ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి అప్పారావు

విజయనగరం క్రైమ్ : ఆర్టీసీలో కార్మికుల డిమాండ్లు గడువులోగా పరిష్కరించకుంటే సమ్మె తప్పదని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) రాష్ట్ర కార్యదర్శి వి.అప్పారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు విజయనగరం ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కోరుతున్న 38 డిమాండ్లపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదన్నారు. తమ డిమాండ్లపై ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేశామన్నారు. తక్షణమే తమ డిమాండ్లపై స్పందించాలన్నారు. లేకుంటే సమ్మె నోటీసు ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. ధర్నాకు రాహుల్ అధ్యక్షత వహించగా దుర్గరాజు, విజయనగరం, ఎస్.కోట సంఘ కార్యదర్శులు రామారావు, చంద్రమౌళి, మహిళ ప్రతినిధులు సరిత, సుజాత, భాను, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో పక్కాగా సరిహద్దులు నిర్ణయించాలి

- రీసర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో భూ సమస్యలు తొలగి రైతులకు, భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రెండవ విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ భూ సర్వే జరిపే ముందు రైతులకు నోటీసులు జారీ చేసి, గ్రామంలో రైతుల భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల భూములు, పోరంబోకు భూములకు కొలతలు వేసి కచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు వేసి తమ భూమికి సంబంధించిన హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రీ సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. రైతులకు నోటీసులు జారీ చేస్తున్నది లేనిది అడిగి ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత మేర సర్వే నిర్వహించిన విషయమై తహసీల్దార్ వై.జయలక్ష్మిని ప్రశ్నించగా 1147 ఎకరాల గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తి కాగా మిగతా 31 ఎకరాలు సర్వే నిర్వహించాల్సి ఉందని ఆమె తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తహసీల్దార్‌తో మాట్లాడుతూ మరణించిన భూ యజమానుల వారసులకు మార్పు చేసే విధంగా ఎఫ్ఎంసీ విచారణ పూర్తి చేసి మ్యుటేషన్‌లను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు తలెత్తకూడదనేది ప్రధానమైన రీ సర్వే ఉద్దేశమని, రైతులు పక్కా భూ రిజిస్ట్రేషన్లు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. రోడ్లుకు కేటాయించిన భూములలో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలన్నారు. చెరువులు, వాగులలోని ఆక్రమణలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే, భూ రికార్డుల నిర్వహణ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మణరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.రవి తేజ, మండల సర్వేయర్ స్వామి, గ్రామ సర్వేయర్ నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

శాంతిభద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ వకుల్ జిందాల్

వంగర: శాంతిభద్రతల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. లక్ష్మీపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం పరిసరాలతో పాటు గ్రామంలోని అన్ని వీధుల్లోను సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. పోలీస్ పికెట్ పాయింట్లు తనిఖీ చేశారు. 2012లో ఎస్సీ, బీసీల మధ్య జరిగిన ఘటనకు గల కారణాలు, గ్రామంలో పరిస్థితులు, న్యాయస్థానంలో కేసు విచారణ వంటి అంశాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. బీసీ, ఎస్సీ వర్గాల మధ్య ఎటువంటి వివాదాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం వంగర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు దిశానిర్దేశం చేశారు. లక్ష్మీపేట దళితులు, దళిత సంఘ నాయకుడు మజ్జి గణపతి ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిశారు. కేసు విచారణకు తమకు పూర్తి స్థాయి న్యాయవాదిని నియమించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేస్తామని ఎస్పీ తెలిపారు. కోర్టులో విచారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్సై షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్మీపేటలో పర్యటిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

క్లుప్తంగా

డీజే దాబాపై విజిలెన్స్ దాడులు


డీజే దాబాలో పట్టుబడిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లతో విజిలెన్స్ అధికారులు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ జంక్షన్ సమీపంలో ఉన్న డీజే దాబాపై మంగళవారం విజిలెన్స్ దాడులు జరిగాయి. ఇంటి అవసరాలకు వాడాల్సిన ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌లను వ్యాపార అవసరమైన డీజే దాబాలో వినియోగించుతుండడంతో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, సిబ్బంది తనిఖీ చేసి పట్టుకున్నారు. దీంతో డీజే దాబాపై 6ఏ కేసు నమోదు చేశామని వివరించారు. పట్టుకున్న 5 గ్యాస్ సిలిండర్‌లను విజయనగరం ఆదిత్య గ్యాస్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. విజిలెన్స్ దాడిలో సీఎస్ డీటీ ఆర్.శంకరరావు, వీఆర్‌వోలు డి.కృష్ణబాబు, మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ


జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను పరిశీలిస్తున్న పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డ్‌లో నిర్మిస్తున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీడి తోటలను సాగు చేసే రైతులకు జీడి పంటకు విలువ ఆధారితను కల్పించేందుకు జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. జీడి రైతులకు, గిరిజనులకు ఈ యూనిట్ ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఇంజినీరింగ్ అధికారి మణిరాజ్, ఏపీవో మురళీధర్ తదితరులున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై ఎంపీడీవో విచారణ


ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆరా తీస్తున్న ఎంపీడీవో రాధిక

పూసపాటిరేగ: మండలంలోని బత్తివలస గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై ఎంపీడీవో ఎం.రాధిక మంగళవారం విచారణ చేపట్టారు.ఆయనపై బినామీ మస్తర్లు వేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయనను కార్యాలయానికి పిలిపించి మరీ విచారణ చేశారు. పలువురు వేతనదారులను కూడా కార్యాలయానికి రప్పించి ఫీల్డ్ అసిస్టెంట్ బినామీ మస్తర్లు వేయడంపై ఆరాతీశారు. గతంలో జరిగిన ఉపాధి పనుల సోషల్ ఆడిట్ లోనూ అవకతవకలు జరిగినట్లు బయటపడిందని గుర్తు చేశారు. తదుపరి చర్యలు ఏం తీసుకుంటారన్నది తెలియాల్సి ఉంది. ఆమె వెంట ఏపీవో తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

చదురుగుడిలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు చదురుగుడిలో పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ చలువపందిళ్లు, మజ్జిగ , మంచినీరు, ఉచిత ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పైడిమాంబ ఆదిపీఠం సభ్యులు ఎస్.అచ్చిరెడ్డి, సూర్యపాత్రో, మహేష్ భక్తులకు పులిహోర, దద్దోజనం అందజేశారు. ఎస్ఆర్ఐ ఆస్పత్రి సిబ్బంది భక్తులకు బీపీ, సుగర్ టెస్ట్‌లు ఉచితంగా చేశారు. పైడితల్లి అమ్మవారి అధ్యాత్మిక కళావేదికపై మయూరి నృత్యాలయ చిన్నారులు వివిధ నృత్యరూపకాలతో భక్తులను అలరించారు.


పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు


వివిధ దేవతామూర్తుల పాటలకు చిన్నారుల నృత్య ప్రదర్శన